# ఇది కథకాదు



— బీనాదేవి

శ్రీనివాసరావు సిటీబస్ దిగేడు.

సుశీల కూడా అదే బస్సు దిగింది.

శ్రీనివాసరావు బాపూ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్ళాలి.

సుశీల బాపూ రోడ్డు వేపుకే తిరిగింది.

శ్రీనివాసరావు ఒళ్ళు జలదరించింది. రెప్ప వెయ్యడం మర్చిపోయాయి అతని కళ్ళు. అడుగు వెయ్యడం మర్చిపొయ్యాయి అతని కాళ్ళు. అతనికి ఆమెని తెలీదు. అయినా తన కాబోయే ప్రేయసిని అతను వెనుక నుంచైనా పోల్చుకోగలడు. అతనికి పాతికేళ్ళు.

అతని ప్రకారం ఆమెకి యిరవై దాటడానికి వీల్లేదు. అంచేత ఆవిడకి యిరవై యేళ్ళే.

ఆమె అతనికంటే పాతిక గజాలు ముందు నడుస్తోంది. ఆమె కట్టుకున్న తెల్ల సిల్కుచీర ఆమెని పొగమంచులా కమ్ముకుంది. దాని జరీ అంచు బంగారు పాముపొరలా ఆమెని నిలువునా చుట్టుకుంది. ఆమె జోళ్ళ ఎర్రపట్టీలు పాదాల రంగులో కలిసిపోయేయి.

శ్రీనివాసరావు గుండెలు కడుపులో కలిసిపోయేయి. జోరుజాస్తీచేసి సుశీలను దాటిన అతను ఆగి వెనక్కి తిరిగేడు.

అన్నివేగాల్లోనూ మనోవేగం ఎక్కువంటారు కాని మనోవేగం కంటె ఎక్కువ ప్రేమవేగం అంటాడు శ్రీనివాసరావు. అంచేత ఆ పాతిక గజాలుదాటడానికి అతనికి పది లిప్తలు కూడా పట్టలేదు.

ఆమెముందు అందం వెనకచందాన్ని మించి వుంది. ఎడమ జడలో తురుముకున్న గులాబీలోతప్ప అలసట ఆమెలో ఎక్కడా లేదు.

ఆమె ముక్కు మూరెడుంది.

కళ్ళు చారెడున్నాయి.

మూతి ముప్పావుంచి వుంది.

అంత నల్లటి జుత్తు లేకపోయినా ఆమె మొఖం బాగా తెల్లగానే కనిపించేది.

'నల్ల ముత్యాలు కూడా వుంటాయి కాబోలు' అనుకుంటారు. ఆమె తెల్లని మెడలో ముత్యాల గొలుసుని చూసిన ఎవరైనా

శ్రీనివాసరావు నవ్వేడు. అతని పళ్లు కట్టుడు పళ్లలా అందంగా వున్నాయి.

సుశీల పళ్లు ఎలా వున్నాయో చెప్పడం కష్టం. ఆమె నవ్వలేదు. ఆమె కనుబొమలు ఒక్క ముడివేసి విప్పేసింది.

రెండో రోజు ఆఫీసు వదిలిన శ్రీనివాసరావు 7 వ నెంబరు బస్సెక్కేడు. సుశీలకూడా ఆ బస్సే ఎక్కింది; అతని ముందు సీటులోనే కూర్చుంది.

అతనికి ఆమెతో పరిచయం చేసుకోవాలనీ, ఆ పరిచయంమొగ్గ పెళ్ళి పువ్వుగావిడాలనీ నిన్ననే అనిపించింది. కాని ఆమెని పలకరించడం ఎలా ?

ఆడవాళ్లని ప్రేమించడం చాల సులభం.

కాని పలకరించడం గొప్ప ఆర్ట్.

మొదటిది అందరూ చెయ్యగలరు. చేస్తారు

రెండోది కొందరే చెయ్యగలరు.

శ్రీనివాసరావు రెండో దానికి రెడీగా వున్నాడు.

"టైమెంత ?" అని అడిగితే.

శ్రీనివాసరావు చేతిని తాటికాయంత వాచీ మెరుస్తోంది.. పక్కనున్న సెట్టికి యింకా మంచి వాచీ గుమ్మడికాయంత వుంది. పోనీ

"పెన్నుందా ?"అని అడిగితే.

తప్పులేదు. అడగొచ్చు. కానీ

"దేనికి ?" అని ఆమె అడిగితే.

"చెవులు గోక్కోవడానికి" అనాలి. అతని జేబులో బస్ టికెట్ మినహా కాయితం ముక్క లేదు.

శ్రీనివాసరావు తెలుగు,హిందీ, చాలా సినీమాలు చూస్తాడు. చాలా సినీమాల్లో ప్రేమ, బస్సులోనో, కాలేజీ లోనో ప్రారంభం అవుతుంది. సినీమాల్లో హీరోయిన్లని పరిచయం చేసుకోవడానికి హీరోలకి మంచి ఛాన్సులు యిస్తారు డైరెక్టర్లు.

బస్ కండక్టర్లకి సినీమా డైరెక్షను రాదు!

ఆమె రుమాలు కిందపడి పోతే!

తలలో గులాబీ గాలికి ఎగిరి పోతే ?

ఆమె రుమాలు కింద పడెయ్యలేదు. సరికదా బస్ దిగేటప్పుడు లంచ్ బాక్సు హేండ్ బేగు కూడా అతి భద్రంగా పట్టుకొని మరీ దిగింది.

మహా గొప్ప జాగ్రత్త గల పిల్ల!

శ్రీనివాసరావూ దిగేడు ఆమె వెనకే.

బాఫూరోడ్డులో నాలుగు ఫర్లాంగులు దిగబెట్టేడు ఆ తర్వాత ఆమె ముందు రోజులాగే చీకటి సందులోకి వెళ్ళిపోయింది.

శ్రీనివాసరావుకి మిగిలివున్న అవకాశం ఒక్కటే కనిపించింది. ఎప్పుడైనా ఏ దయామయుడైన రౌడీవో ఆమెను ఆ సందులో సైంధవుడిలా పట్టుకుంటే, తను వెళ్ళిరక్షించి, మొన్న "కంచు మనిషి" సినీమాలో కృష్ణారావులా ... కృతజ్ఞతలు .. కన్నీళ్ళు ... వెన్నెల నవ్వులు...నవ్వుల పాపలు ... ఓహ్

అదొక్కటే అతని కోరిక.

* * *

కోరికలు మనిషన్న ప్రతివాడికీ వుంటాయి. కాని అవకాశాలు ఏ కొందరికో కాని రావు. అసలు కొందరికి రానే

రావు. కాని శ్రీనివాసరావు కోరుకున్న ఆ అవకాశం ఆ రోజు వచ్చింది చీకటి సందులోకి తిరిగిన సుశీల కెవ్వున కేక వేసింది. సందు దాటిన శ్రీనివాసరావు గప్పున పరిగెత్తేడు సందులోకి. వణుకుతున్న ఆమె కంఠస్వరం అందరి హీరోయిన్ల కంఠస్వరానికీ మించి వున్నా, ఆమె పక్కనే నేలని ఒకకాలు ఆనించి, సైకిల్ మీద కూర్చుని, ఆమె భుజం మీద ఒక చెయ్యి వేసిన రౌడీ మాత్రం అందరు విలన్లకంటె భయంకరంగా వున్నాడు.

అతని చెంపలు దవడలదాకా వున్నాయి.

అతని తోలుబెల్టుకి ఇత్తడి ముళ్ళున్నాయి.

అతని మీసాలు మారీచుడి మీసాల్లా వున్నాయి.

శ్రీనివాసరావు భారతం చదవలేదు కాబట్టి కాని లేకపోతే బహుశా కీచకుడు యిలాగే వుండి వుండేవాడు అనుకున్నాడు. అతను శ్రీనివాసరావుని కొట్టిన దెబ్బ ఘటోత్కచుడి దెబ్బలా వుంది.

దెబ్బకి కిందపడిన శ్రీనివాసరావు వీరాభిమన్యుడిలా లేచాడు. ఆవిడని రక్షించడానిక్కాదు తనని రక్షించుకోవడానికి.

అతనికి ఆ తర్వాత జ్ఞాపకం వున్న విషయాలు– గాలిలోకి ఎగరడం– రౌడీని కడుపు మీద తన్నడం.

అతని చీకటి కళ్ళకి వెల్తురు వచ్చేసరికి రౌడీ లేడు.

రౌడీకంటే భయంకరంగా చూస్తున్న హీరోయిన్ వుంది.

శ్రీనివాసరావు మనసు అప్పుడు ప్రేమ, పెళ్ళి మీదికి వెళ్ళలేదు. బతికి వుంటే మేనమావ కూతుర్ని చేసుకోవచ్చు. లేకపోయినా ఫరవాలేదు, కాని అలాగే అక్కడే ఆ సందులోనే ఒక అరగంట నిద్రపోతే బావుండునని పించింది కాని సుశీల అతన్ని నిద్రపోనివ్వలేదు.

ఆవిడ శ్రీనివాసరావుకంటే ఎక్కువ సినిమాలుచూస్తుంది. తెలుగు, హిందీలే కాకుండా అరవ కన్నడ, మళయాళ వగైరాలన్నీ చూస్తుంది. "బంగారపు బొమ్మ" లో యిలాగే విలన్ ఒక లాలూచీ రౌడీని హీరోయిన్ మీదికి వదిలి ఆవిడని రక్షించినట్టు నటించి ఆమెని పెళ్ళాడి అంట్లు తోమించి నానా బాధలూ పెట్టేడు.

"....ఇలా బేడా పరక ఆలోచనలకి పడే రకాన్ని కాదు నేను. ఏవనుకుంటున్నావో, కాని. ఆ రౌడీగాడ్ని వదిలి నన్ను రక్షించినట్టు నటించి నువ్వు పెళ్లాడేద్దామనుకున్నావేమిటో'—వారం నుండి చూస్తున్నాను — కుక్కలా నా వెంటే..." సుడిగాలి వెళ్ళిపోయింది సుశీల రూపంలో.

ఘటోత్కచుడి దెబ్బకైనా తట్టుకున్న అతను హీరోయిన్ దెబ్బకి తట్టుకోలేకపోయేడు.